పాలెంలో హైకోర్టు జడ్జిల పూజలు

జడ్జిలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

బిజినేపల్లి, జూన్ 22 : మండలంలో వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జేష్టాభిషేక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పూజల్లో హైకోర్టు జడ్జిలు ప్రియదర్శిని, మాధవీదేవిలతోపాటు జిల్లా జడ్జి రాజేశ్‌బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వేదమంత్రోచ్చరణల మధ్య కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్‌రెడ్డి, చంద్రారెడ్డి, నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి సర్కారు కృషి

- అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జూన్ 22 : రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్యాబినెట్ సమావేశంలో రైతు రుణమాఫీపై సర్కారు తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గవిషయమన్నారు. రుణమాఫీ కోసం రూ.31వేల కోట్ల నిధులు అవసరమవుతాయన్నారు. రైతుభరోసా కోసం మంత్రివర్గ ఉపసంఘాన్ని ప్రభుత్వం నియమించిందని, అర్హులకు అందజేస్తామన్నారు. మిగిలిన హామీలను సైతం నెరవేర్చుతామన్నారు. కార్యక్రమంలో బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసులు, నాయకులు కాశన్నయాదవ్, మాధవరెడ్డి, మల్లేశ్, రాంప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

అనంతరం నియోజకవర్గంలోని బల్మూర్, లింగాల, వంగూరు మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నదన్నారు. అచ్చంపేటలో ముదిరాజ్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి సహకరించాలి

షాపుల యాజమానులతో మాట్లాడుతున్న నరేశ్‌బాబు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 22 : నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వాణిజ్య షాపులకు సంబంధించి లైసెన్స్‌లు తీసుకొని పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరేశ్‌బాబు పట్టణ ప్రజలను కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ఉన్న వాణిజ్య షాపుల యాజమానులతో ఆయన శనివారం మాట్లాడారు. లైసెన్స్‌లు తీసుకోని వారు వెంటనే తీసుకోవాలన్నారు. ఇందుకు సంబంధించి నాలుగు టీంలను ఏర్పాటు చేయడం జరిగిందని, షాపుల వద్దకు వచ్చే పురపాలక సిబ్బందికి సహకరించి లైసెన్స్‌లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ యాదయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, జూనియర్ అసిస్టెంట్ శివశంకర్‌తో పాటు వార్డు ఆఫీసర్లు ఉన్నారు.

చారకొండ కేజీబీవీలో సమస్యలు తిష్ట

- మిషన్‌భగీరథ నీళ్లే దిక్కు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

తరగతి గదిలో కిందే కూర్చొని చదువుకుంటున్న విద్యార్థినులు

చారకొండ, జూన్ 22 : చదువుకు దూరంగా ఉన్న పేద విద్యార్థులు, తల్లిదండ్రులు చదివించలేక విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసిన విద్యార్థులు చదువుకోవాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ విద్యాలయాల(కేజీబీవీ) లక్ష్యం నెరవేరడం లేదు. చారకొండ మండలంలో మారుమూల గ్రామాలు, తండాలు అధికంగా ఉన్నాయి. మండల కేంద్రంలో కేజీబీవీకి రూ.కోటికి పైగా వెచ్చించి నూతనంగా భవనం నిర్మించారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 300 మంది వరకు విద్యార్థినులు చదువుకుంటున్నారు. మిషన్ భగీరథ నీళ్లు వస్తేనే విద్యార్థినులకు తాగునీరు లేకుంటే తీవ్రమైన అవస్థలు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు కూడా సరిపడా రావడంలే దు. చారకొండ నుంచి రెండు కిలో మీటర్ల దూరంగా పొలాలు, గుట్టలు మధ్య భవనం నిర్మించడంతో కనీసం ప్రహరీ నిర్మాణం చేయకపోవడంతో రాత్రి సమయంలో విద్యార్థినులు భయందోళనకు గురవుతున్నారు. ప్రహరీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలు మంజూరైన నిధులు వెనక్కి వెళ్లాయి. అదేవిధంగా జిల్లాలో నూతనంగా ఏర్పాటు చేసిన కేజీబీవీలో బెంచీలు లేక విద్యార్థులు కిందనే కూర్చొని పాఠాలు వింటున్నారు. ఇప్పటికైనా ఉన్నాతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రహరీ నిర్మాణం తో పాటు, తాగునీటి సమస్య పరిస్కరించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

కేజీబీవీలో తాగునీటి సమస్య, ప్రహరీ నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులకు, ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మిషన్ భగీరథ నీరు రాని రోజు ఇబ్బందులు పడుతున్నాం. జీపీ ట్యాంకర్ ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో బోరు వేయించి తాగునీటి సమస్య రానివ్వకుండా చర్యలు తీసుకుంటాం.

- మంజుల, ఎస్‌వో, చారకొండ

మృతురాలి కుటుంబానికి పరామర్శ

చారకొండ, జూన్ 22 : మండలంలోని జేపల్లికి చెందిన కృష్ణమ్మ అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ నూర్‌పాల్‌నాయక్, నాయకులు వెంకటేశ్, అరవింద్, శేఖర్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రోత్సాహకాలను అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనసూయ

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 22 : విద్యార్థులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎస్.అనసూయ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రిలయన్స్ ట్రెండ్స్ వారి సౌజన్యంతో ప్రతిభా ప్రోత్సహాకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రిలయన్స్ సంస్థ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లెక్చరర్లు నర్సింహులు, రవిప్రకాశ్, రవీందర్‌రెడ్డి, యూనస్, సత్యం, హరిత, శిరీష, విద్యార్థులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నాగర్‌కర్నూల్, జూన్ 22 : నాగర్‌కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న మొలచింతలపల్లి ఆదివాసి మహిళ ఈశ్వరమ్మను శనివారం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. పాశవికదాడి దురదృష్టకరమన్నారు. ప్రభుత్వపరంగా కుటుంబానికి రూ.2లక్షలు ప్రకటించామన్నారు. వారి పిల్లలను రెసిడెన్షియల్ పాఠశాలలో చదివించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

మల్లురవికి ఘనస్వాగతం..

తిమ్మాజిపేట, జూన్ 22 : నాగర్‌కర్నూల్ ఎంపీగా ఎన్నికైన మల్లురవికి శనివారం మండలంలో ఘనస్వాగతం పలికారు. మరికల్ గ్రామం వద్ద ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఘనస్వాగతం పలికారు.

వెంకన్న ఆలయంలో పూజలు..

బిజినేపల్లి, జూన్ 22 : మండలంలోని వట్టెం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

భగీరథ సర్వే పూర్తి చేయాలి

- ఎంపీడీవో బాలచందర్ సృజన్

గుంత తీస్తున్న ఎంపీడీవో బాలచందర్ సృజన్

అచ్చంపేట రూరల్, జూన్ 22 : మండలంలోని నడింపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో బాలచందర్ సృజన్ శనివారం పరిశీలించారు. అనంతరం నర్సరీ పనులను పరిశీలించి ఉపాధి కూలీలకు పలు సలహాలు, సూచనలు చేశారు. మిషన్ భగీరథ సర్వేను పరిశీలించి అందరికి శుద్ధ జలం అందుతుందా? లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొందరు తమ కాలనీల్లో పైపులైన్ సక్రమంగా వేయలేదని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. సర్వేను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలు రోడ్డు వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తుండగా ఎంపీడీవో వారితో కలిసి గడ్డపార పట్టి పనులు చేశారు. అదేవిధంగా ఉప్పునుంతల మండలంలోని అయ్యవారిపల్లి, ఈరట్వానిపల్లిలో నర్సరీ పనులు, మిషన్ భగీరథ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

బొగ్గు గనుల బహిరంగ వేలాన్ని నిలిపివేయాలి

నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 22 : బొగ్గు గనుల బహిరంగ వేలాన్ని వెంటనే నిలిపి వేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీల మద్దతుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్న ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన 20రోజుల్లోనే ప్రైవేటీకరణకు తెరలేపిందని, అందులో భాగంగానే తెలంగాణలో ఉన్న 61బొగ్గు గనులను ప్రైవేటీకరించడానికి బహిరంగ వేలం ద్వారా బడా కార్పొరేట్లకు అప్పగించడానికి ముందుకొచ్చిందన్నారు. వెంటనే బొగ్గు గనుల బహిరంగ వేలం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రామయ్య, కాశన్న, శివశంకర్, కుర్మయ్య, కృష్ణయ్య, మశన్న, బారుసావులు ఉన్నారు.

విద్యార్థులకు బ్యాగులు వితరణ

పాఠశాల విద్యార్థులకు బ్యాగులను అందచేస్తున్న ఎన్ఆర్ఐ సోదరుడు

ఉప్పునుంతల, జూన్ 22 : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, బాలుర, బాలికల ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఉప్పునుంతల చెందిన ఎన్ఆర్ఐ మర్యాద రుక్మారెడ్డి బ్యాగులను వితరణ చేశారు. ఆయా పాఠశాలల్లోనే చదివి అమెరికాలో ఉద్యోగం చేస్తూ అక్కడనే స్థిరపడారు. జన్మనిచ్చిన ఊరికి, చదివిన పాఠశాలకు చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో శనివారం రుక్మారెడ్డి తరపున సోదరుడు కృష్ణారెడ్డి విద్యార్థులకు బ్యాగులను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సుప్రీం' జడ్జితో విచారణ జరిపించాలి

- నీట్ లీకేజీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న సంఘాల నేతలు

అచ్చంపేట రూరల్, జూన్ 22 : నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డీవైఎఫ్ఐ, ఎస్ఎస్‌యూఐ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి, యువజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. దేశవ్యాప్తంగా 25లక్షల మంది నీట్ పరీక్ష రాస్తే మొదటి ర్యాంక్ 67 మందికి రావడంలో బీజేపీ నేతల హస్తం ఉన్నదని ఆరోపించారు. నీట్‌పై స్పందించని ప్రధాని మోదీ నిరుద్యోగులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి విద్యార్థుల జీవితాలతో ఆటలాడడం సరికాదన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తు నుబ్గిపాలు చేశారని మండిపడ్డారు. బాధ్యులపై చర్య లు తీసుకోకపోతే విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యం లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వర్ధం సైదులు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సంతోష్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.మహేశ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు సూచనలు చేస్తున్న ఎంపీడీవో సృజన్

ముగిసిన మూడ్రోజుల శిక్షణ

అచ్చంపేట టౌన్, జూన్ 22 : పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు నిర్వహించిన రివైజ్డ్ ప్రీ ప్రైమరీ కరికులం ట్రైనింగ్ శనివారంతో ముగిసిందని సీడీపీవో దమయంతి తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీడీవో బాలచందర్ సృజన్ పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ సెంటర్లలో ప్రీస్కూల్ కార్యక్రమాలు చురుకుగా నడపాలని, సెంటర్లలో టాయిలెట్లను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో కమల, సూపర్‌వైజర్లు,, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

అచ్చంపేట టౌన్, జూన్ 22 : అచ్చంపేట పట్టణంలోని 13వ వార్డు వలపట్లలో బీఆర్ఎస్ నాయకుడు ఆంజనేయులు తండ్రి సాయిలు శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్ సాయిలు పార్థీవ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో శంకర్ మాదిగ, మంద వెంకటయ్య, తిరుపతయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

దీపక్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

కల్వకుర్తి రూరల్, జూన్ 22 : పట్టణంలోని వైఆర్ఎం కళాశాలలో నీట్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించిన కోట్ల దీపక్‌రెడ్డిని కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్యగౌడ్ శనివారం సత్కరించారు. పట్టణానికి చెందిన కోట్ల చిన్నారెడ్డి, మంజుల దంపతుల కుమారుడు దీపక్‌రెడ్డి వైఆర్ఎం కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించి ఆలిండియా నీట్ ఫలితాల్లో 532 మార్కులు సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ సాంబయ్యగౌడ్, వైస్ ప్రిన్సిపాల్ శంకరయ్యలు బొకే అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ప్రభాకర్‌గౌడ్, యాదయ్య, బాలరాజు, రామకృష్ణ, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ కోకన్వీనర్‌గా గిరినాయక్

ఊర్కొండ, జూన్ 22 : తెలంగాణ రాష్ట్ర గిరిజన సేవాలాల్ కోకన్వీనర్‌గా మండలానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు గిరినాయక్‌ను శుక్రవారం హైదరాబాద్ వెంగల్‌రావు విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సేవాలాల్ సేవ వ్యవస్థాపకుడు భూక్యా సంజీవ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గిరినాయక్ మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

దీర్ఘకాలిక శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కల్వకుర్తి, జూన్ 22 : 2024-2025 విద్యా సంవత్సరానికి నీట్‌లో అర్హత సాధించేందుకు దీర్ఘకాలిక శిక్షణ పొందేందుకు అర్హత కలిగిన విద్యార్థుల నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ దరఖాస్తులను ఆహ్వానిస్తుందని జేపీనగర్ ఎస్సీ గురుకుల పాఠశాల/కళాశాల ప్రిన్సిపాల్, డీసీవో దానం చెప్పారు. హైదరాబాద్‌లోని టీజీఎస్ఆర్ఎస్ సీవోఈ గౌలిదొడ్డి, నార్సింగ్, చిల్కూర్, మహేంద్రహిల్స్ గురుకులాల్లో నీట్ కోసం లాంగ్ టర్మ్ శిక్షణ ఇస్తారని చెప్పారు. అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులకు పైన తెలిపిన విద్యాలయాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి నీట్-2024 పరీక్ష రాసిన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు WWW.tgsweeis.telangana.gov.in వెబ్ సైట్ ద్వారా రూ.200 చెల్లించి ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నీట్ పేపర్ లీకేజీపై విచారణ జరిపించాలి

చారకొండ, జూన్ 22 : దేశంలో నీట్ పరీక్ష లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నీట్ పేపర్ లీకేజీకి ప్రధాన మంత్రి పూర్తి బాధ్యత వహించాలని, సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని చెప్పారు.

కోతలకు గురైన రోడ్లు

కల్వకుర్తి రూరల్, జూన్ 22 : ఇటీవల కురిసిన వర్షాలకు ఆయా

కోతకు గురైన కల్వకుర్తి- ఎల్లికల్ రహదారి

గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు కోతలకు గురై వాహనదారులకు ఇబ్బందికరంగా మారాయి. కల్వకుర్తి నుంచి అచ్చంపేట వయా ఎల్లికల్ గ్రామం గుండా వెళ్లే ప్రధాన రహదారి పలు చోట్ల కోతలకు గురైంది. రాత్రి వేళల్లో వెళ్లే వాహనదారులకు రహదారి ప్రక్కన వర్షం నీటి వల్ల ఏర్పడిన కోతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారి కోతలకు గురైన ప్రదేశంలో మట్టిని పోయించాలని అదేవిధంగా మూల మలుపుల వద్ద ఏపుగా పెరిగిన కంప చెట్లను,ముళ్ల పొదలను తొలగించాలని వాహనదారులు సంబంధిత శాఖాధికారులను కోరుతున్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

వంగూరు, జూన్ 22 : ప్రభుత్వం వీవోఏల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు శివరాములు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం వీవోఏల సంఘం అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన వీవోఏల సమావేశంలో శివరాములు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి మహిళా సంఘాల సభ్యులకు సేవలు అందిస్తున్న వారు కనీస వేతనాలకు నోచుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వారి సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.

వీవోఏలకు కనీస వేతనం రూ.26 వేలతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. సమావేశంలో రామస్వామి, వీవోఏలు పాల్గొన్నారు.

సాగులో జాగ్రత్తలు పాటించాలి

తాడూరు : మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి చక్రపాణి

తాడూరు, జూన్ 22 : వానకాలం పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి చక్రపాణి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పాం, మిరప విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయిల్‌పాం సాగులో సబ్సిడీ గురించి తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 90శాతం సబ్సిడీతో పాటు డ్రిప్, మొక్కలపై రాయితీ వస్తుందన్నారు. మిరప పంటపై వచ్చే చీడపీడలు, నివారణ చర్యల గురించి వివరించారు. సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేసి అధిక దిగుబడి సాధించాలని సూచించారు.

ఆముదం సాగుపై శిక్షణ

అమ్రాబాద్, జూన్ 22 : మండలంలోని మన్ననూర్ రైతువేదికలో శనివారం ఆముదం సాగు యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ పాలెం ఆముదం విభాగం శాస్త్రవేత్తలు నళిని, సదయ్య, ఈశ్వర్‌రెడ్డి, దివ్యారాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. కోతుల బెడద ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో ఆముదం సాగు చేస్తే ఇబ్బందులు ఉండవన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు పొందవచ్చని, ప్రథమశ్రేణి ప్రదర్శనలో భాగంగా ఆముదం, కంది అంతర పంటలుగా వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ ప్రథమశ్రేణి ప్రదర్శనలో కావాల్సిన ఆముదం (సిహెచ్-5), కంది (పీఆర్జీ 176) విత్తనాలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏఈవోలు సీతారాం, ముంతాజ్‌బేగం, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

ఉప్పునుంతల, జూన్ 22 : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో చదివి గురుకులాల్లో సీట్లు పొందిన ఎడుగురు విద్యార్థులను శనివారం ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. గురుకులాల్లో సీట్లు పొందిన భరత్, యువరాజు, విగ్నేశ్, ప్రియదర్శిని, గాయత్రి, సింధు, శ్రీలత సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు నర్సింహారెడ్డి, వెంకటలక్ష్మి, రామచంద్రారెడ్డి, శేఖర్ ముదిరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

ఉద్యోగ అవకాశం

★NBFC కంపెని నందు పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్ కావలెను. జీతం 15K నుండి 20K వరకు ఇవ్వబడును. సం.ప్ర. 8660148086, 9590125555.
NT-MBNR

HOUSE FOR SALE

★INDEPENDENT HOUSE FOR SALE AT YENUGONDA, G+1 . 150 Sq.Yrds., Prime location, secure neighborhood, all the essential amenities located nearby. Price : 1 crore, Contact : 9966698792, 9505506523.
NT- MBNR

WANTED

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794